నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం

06 మే 2025 పేజీలు : 08



## సీఎం చంద్రబాబు కలిసిన
# ఎమ్మెల్యే కోటంరెడ్డి



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సోమవారం అమరావతిలో నెల్లూరు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో జరుగుతున్న 339 అభివృద్ధి పనులను ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వివరించారు. అలాగే మే 15న పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను నెల్లూరు రూరల్‌లో ప్రారంభిస్తున్నామని తెలిపారు. అనంతరం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# మాది ప్రజా ప్రభుత్వం



- పార్కుల అభివృద్ధితోనే ప్రజలకు ఆహ్లాదం.. ఆనందం
- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ
- నగరంలో ఆధునీకరించిన తిక్కన పార్కును ప్రారంభించిన మంత్రి నారాయణ
- పూర్ణకుంభం, కొలాటాలతో మంత్రికి ఘన స్వాగతం పలికిన మహిళలు

నగరంలో ఆధునీకరించి ప్రారంభిస్తున్న ఒక్కొక్క పార్కులో పిల్లల కేరింతలు, ఆనందం చూస్తుంటే మనసుకు చాలా సంతృప్తిగా ఉందని మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు.

లోపల పేజీలో

# పేదలపై అంత కక్ష దేనికి..

- నిరుపేదలను ఖాళీ చేయించేందుకు ప్రభుత్వ ప్రయత్నం
- అప్రమత్తమై.. అండగా నిలబడి పోరాడిన పర్వతరెడ్డి



2 లో

- రాష్ట్ర వ్యాప్తంగా 700 తృప్తి క్యాంటీన్లను ప్రారంభించేందుకు ప్రణాళిక
- పేద మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారుచేయడమే లక్ష్యం
- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ
- రాష్ట్రంలోనే మొట్టమొదటి తృప్తి కాంటీన్
- నెల్లూరులో ప్రారంభించిన మంత్రి
- సత్ఫలితాలిస్తున్న ప్రభుత్వ స్మార్ట్ స్ట్రీట్ ప్రయోగం




# పేద మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే సీఎం సంకల్పం

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :**

పేద మహిళలకు చేయూతనిచ్చి పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా 700 తృప్తి క్యాంటీన్లను ప్రారంభించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. నెల్లూరు నగరం ఆత్మకూరు బస్టాండ్ సెంటర్ సమీపంలో 12.5 లక్షల వ్యయంతో మెప్మా ఆధ్వర్యంలో మహిళలు ఏర్పాటు చేసిన తృప్తి క్యాంటీన్‌ను సోమవారం మెప్మా ఎండీ తేజ్ భరత్‌తో కలిసి మంత్రి నారాయణ ప్రారంభించారు. కాంటీన్ నిర్వహణపై మహిళా వ్యాపారులను మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని మంత్రి ఆకాక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. తృప్తి కాంటీన్ ప్రారంభించటం చాలా తృప్తిగా ఉందన్నారు. పేద మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే సీఎం చంద్రబాబు సంకల్పంగా మంత్రి చెప్పారు. స్మార్ట్ స్ట్రీట్ ప్రోగ్రాంలో భాగంగా రాష్ట్రంలోనే తొలి తృప్తి కాంటీన్ నెల్లూరులో ప్రారంభించామని, సారా ప్రాజెక్టు టైఅప్‌తో నలుగురు మెప్మా మహిళలతో కాంటీన్ ప్రారంభించినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 3 వేల మంది మెప్మా మహిళలతో 700



కాంటీన్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఒక్కో మహిళా ఎంటర్ ప్రయినర్ నెలకు 30 వేలు సంపాదించేలా చేస్తామని చెప్పారు. ఒక్కొక్క తృప్తి క్యాంటీన్లో నలుగురు మెప్మా మహిళలు ప్రత్యక్షంగా ఉపాధి పొందుతారని, పరోక్షంగా

-మిగతా 2లో

# అక్రమ మైనింగ్ దోపిడీలో.. తోడు దొంగలు



- అక్రమ మైనింగ్ చేశారు కాబట్టే కాకాణి పారిపోయారు..
- వీపీఆర్ మైనింగ్ వ్యాపారం చేసేటప్పుడు అనిల్ పుట్టిండను
- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

అక్రమ మైనింగ్ దోపిడీలో కాకాణి, అనిల్ తోడు దొంగలు.. కాకాణిపై విచారణ, అరెస్ట్ ఉత్తర్వులతో ఉలిక్కిపడిన అనిల్.. తానూ మైనింగ్, ఇరిగేషన్ శాఖా అక్రమాలపై విచారణ ఎదుర్కోవాల్సి వస్తుందని ముందే ఎదురుదాడికి దిగారని అనిపిస్తోందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పేర్కొన్నారు. సోమవారం తెలుగుదేశం పార్టీ నెల్లూరు జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమ మైనింగ్ చేశారు కాబట్టే కాకాణి పారిపోయారు.. తప్పు చేయకపోతే ప్రభుత్వాన్ని ప్రశ్నించేవారు కదా ! అన్నారు. మైనింగ్‌కి డిమాండ్ పడిపోవడానికి, కొనడానికి చైనా ముందుకు రాకపోవడానికి కాకాణి, అనిల్ ఇద్దరే కారణమన్నారు. కాకాణిపై పెట్టిన అక్రమ కేసులకు, కూటమి వేధింపులకు భయపడం, వెనుకడుగు వేయమని మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు ఆయనలోని అభద్రతాభావాన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు. కాకాణిపై కేసులు పెట్టింది ఎవరు అనిల్ ? కాకాణి అక్రమ మైనింగ్‌పై నాటి వైసీపీ ప్రభుత్వం, జిల్లా అధికారులు చోద్యం చూస్తూ చేతులు ముడుచుకుంటే సోమిరెడ్డి ఫిర్యాదుతో జోక్యం చేసుకుంది

-మిగతా 2లో

# పేదలపై అంత కక్ష దేనికి..

- 150 నిరుపేద కుటుంబాలను జేసీబీల సాయంతో అకస్మాత్తుగా ఖాళీ చేయించేందుకు ప్రభుత్వ ప్రయత్నం
- అప్రమత్తమై.. అండగా నిలబడి పోరాడిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి
- బాధితులకు నేనున్నానని భరోసా



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** గత రెండు రోజులుగా రైల్వే అధికారులు నెల్లూరు 52వ డివిజన్ బర్మాషాల్ గుంట రైల్వే ప్రాంతంలో ఉన్న అతి పేద కుటుంబాల ఇళ్లను ఖాళీ చేయమని లేదంటే 6 వ తేదీ రాత్రి జేసీబీ లతో తొలగిస్తామని అనౌన్స్‌మెంట్ చేయించి హెచ్చరికలు జారీ చేస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి.. జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, కమిషనర్‌లతో మాట్లాడారు. అధికారులను ఒప్పించి పేదవారికి ప్రత్యామ్నాయం చూపే వరకు వారిని బలవంతంగా ఖాళీ చేయించవద్దని కోరారు. కలెక్టర్ స్పందించి అందుకు అంగీకరించారు. ఈ సందర్భంగా పేదలకు ప్రత్యామ్నాయం చూపేవరకు బాధితుల పక్షాన నిలబడి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని బాధితులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. బర్మాషాల్ గుంట రైల్వే స్థలాల్లో గత 50 సంవత్సరాలుగా 150 కుటుంబాలు కూలి పనులు చేసుకుంటూ ఈ ప్రాంతంలో జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలోనే.. వీరి ఇళ్ళను తొలగించి ఇక్కడ రైల్వే ట్రాక్ విస్తరణ పనులు చేపట్టాలని నిర్ణయించారని తెలిపారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత.. వీరికి ఆరు అంకణాల ఇళ్ళ స్థలాలు కేటాయించి.. అందులో ఇళ్ళ నిర్మాణాలను 80 శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. అయితే అర్థాంతరంగా రైల్వే అధికారులు వచ్చి మీరు ఇక్కడి నుంచి ఖాళీ చేసి వెళ్ళిపోవాలి.. లేదంటే జేసీబీలతో మీ ఇళ్ళను 6వ తేదీ సాయంత్రం కూల్చేస్తామంటూ.. పేదలను భయభ్రాంతులకు గురి చేయడం అన్యాయమన్నారు. నిరుపేదలను ఉన్నఫలంగా ఇళ్లను కూల్చేసి వెళ్ళమంటే ఎక్కడికి వెళ్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బాధితుల విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి మాట్లాడడం కూడా జరిగిందన్నారు. బాధితులకు ప్రత్యామ్నాయ ఇంటి వసతిని చూపకుండా.. ఖాళీ చేయాలని ఆదేశాలివ్వడం విడ్డూరమన్నారు. సాక్షాత్తు మంత్రి నారాయణ సొంత నియోజకవర్గంలోని పేదలకు అన్యాయం జరుగుతుంటే మంత్రి ఎందుకు స్పందించడం లేదన్నారు. బాధితులకు ఒక నెల సమయం ఇచ్చి ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయించాలని.. అప్పటి వరకు బాధితులకు టిడ్కో ఇళ్ళను కేటాయించాలాని అధికారులను కోరామన్నారు. అందుకు అధికారులు ఒప్పుకున్నారన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బాధితుల పక్షాన నిలిచి పోరాటం చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బర్మాషాల్‌గుంట బాధితులను ఆదుకోవాలి : కలెక్టర్‌కు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి వినతి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** రైల్వే స్థలాల్లో నివసిస్తున్న నిరుపేదలను బలవంతంగా ఖాళీ చేయించే ముందు వారికి ప్రత్యామ్నయంగా టిడ్కో ఇళ్ళను కేటాయించాలని బాధితులతో కలిసి జిల్లా కలెక్టర్‌ను ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సోమవారం వినతిపత్రం ద్వారా కోరారు. నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో బర్మాషాల్ గుంట రైల్వే స్థలాల్లో నివసిస్తున్న వారితో కలిసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ ఇంచార్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి బాధితులకు టిడ్కో గృహాలు కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి బాధితుల పరిస్థితి, ఆందోళనను కలెక్టర్‌కి తెలియజేసి బాధితుల ఇళ్ళ నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయంగా టిడ్కో ఇళ్ళను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చేసిన విజ్ఞప్తికి కలెక్టర్ స్పందించి బాధితులకు ఎలాంటి ఇబ్బంది కలగనివ్వకుండా వారిని టిడ్కో ఇళ్లకు తరలించిన తర్వాతే అక్కడ రైల్వే ట్రాక్ విస్తారణ పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. బర్మాషాల్‌గుంట రైల్వే స్థలాల్లో నివసిస్తున్న వారి పరిస్థితిని జిల్లా కలెక్టర్‌కు తెలియజేసి టిడ్కో ఇల్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. బాధితులకు టిడ్కో ఇల్లు కేటాయించిన తర్వాతే వారి ఇల్లు తొలగిస్తామని కలెక్టర్ చెప్పారన్నారు. బాధితులకు ఇచ్చిన ఆరంకణాల ప్రభుత్వ స్థలాల్లో త్వరితగ తిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి సకాలంలో బాధితులకు అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు హంజా హుస్సేని, రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లి నిర్మల, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కార్పొరేటర్ ఊటూకూరు, నాగార్జున, జిల్లా ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ వేలూరు ఉమామహేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మజ్జిగ జయకృష్ణారెడ్డి, కార్పొరేటర్లు కామాక్షిదేవి, జయలక్ష్మి, నీలి రాఘవరావు, నేతాజీ వేదవతి సుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు పెర్నేటి కోటీశ్వర్ రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మున్వర్, యసదాని విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు ఆశ్రిత్ రెడ్డి, 11వ డివిజన్ ఇంచార్జ్ మహేష్ యాదవ్, మాబాషా, పెంచలయ్య, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అక్రమ మైనింగ్ దోపిడీలో.. కాకాణి, అనిల్ తోడు దొంగలు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర మైనింగ్ శాఖ కాదా ? నాటి ప్రభుత్వ ప్రధానకార్యదర్శి జవహర్ రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, జిల్లా కలెక్టర్, ఎస్పీల నుండి కేంద్ర మైనింగ్ శాఖ వారు సమాచారం తెప్పించుకుని కాకాణి అక్రమ మైనింగ్ చేస్తున్నారని నిర్ధారించుకున్న మాట వాస్తవం కాదా ? అని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వంలో ఏనాడైనా మైనింగ్ వ్యాపారులు కోర్టుకు వెళ్ళారా.. అని ప్రశ్నించిన అనిల్.. మీ ప్రభుత్వంలో జరిగిన దౌర్జన్యం గురించి మేము చెప్పాలా ? గజగజా వణకడం తప్ప కోర్టు మెట్లు ఎక్కే ధైర్యం నాటి వ్యాపారులకు ఉందా.. 'నా మైన్ లోకి చొరబడి అక్రమంగా మైనింగ్ తవ్వుకుంటున్నారని, అమ్ముకుంటున్నార'ని రుస్తుం మైన్స్ వారు కోర్టుకు వెళ్లి ఆర్డర్ తెస్తే నాటి ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, ఎస్పీ పట్టించుకున్నారా ? తోడేరులోని 5 ప్రాంతాలలో మాజీ మంత్రి కాకాణి అక్రమంగా మైనింగ్‌ను త్రవ్వి, తన మైన్స్‌లో తెచ్చిపోసి, వారిది నాది అంతా కలిపి అమ్ముకుంటున్నారని రుస్తుం యాజమాన్యం గగ్గోలు పెడితే సీఎం, చీఫ్ సెక్రటరీ, డీజీపీ కార్యాలయాలు నాడు స్పందించాయా ? అక్రమ మైనింగ్ చేస్తున్న చిత్రాలు, 14 ప్రొక్లయిన్లు, 30 డంపర్‌లు, గౌడన్ల నిండా ఉన్న జిలెటిన్ స్టిక్స్ ను వీడియోలు తీసి కేంద్ర మైనింగ్ సెక్రటరీకి పంపితే తప్ప నాడు అక్రమ మైనింగ్ ఆగలేదన్నారు. 5 ఏళ్ల పాటు సోమిరెడ్డి మొదలుకొని కిందిస్థాయి కార్యకర్త వరకు అక్రమ కేసులతో వేధించడమే కాక, అక్రమ మైనింగ్, ఆరాచకాలు, దౌర్జన్యాలు చేసిన కాకాణిపై కేసులు పెట్టక జై కొట్టాలా అనిల్ ? వీపీఆర్ తండ్రి వేమిరెడ్డి కోటారెడ్డి 50 ఏళ్ల క్రితం నుండే మైనింగ్ వ్యాపారంలో ఉన్నారని, బత్తనపల్లి, అమ్మవారి పాలెం, బాల దుర్గ గని, బాటా గని, జానకి రామ్ తదితర మైన్‌లు నిర్వహించారని, ఆఫ్రికా, ఇండోనేషియాతో సహా ప్రపంచ వ్యాప్తంగా మైనింగ్ వ్యాపారం చేసిన చరిత్ర వీపీఆర్ కుటుంబానిదన్నారు. జగన్ తాత రాజారెడ్డికి మైన్స్ అమ్మిన కుటుంబం వీపీఆర్‌దన్నారు. లక్ష్మి క్వాడ్జ కంపెనీ వీపీఆర్ దేనని, ఆ విషయం తాను బయట పెట్టానని అనిల్ గొప్పగా చెబుతున్నారు.. వీపీఆర్ కంపెనీ పెడితే తప్పేముంది అనిల్ ? స్థానికంగా దొరికే వనరుల ఆధారంగా చట్టపరమైన అనుమతులతో కంపెనీ పెట్టడం నేరమేమి కాదే.. అన్నారు. కేంద్ర ప్రభుత్వం పరిశ్రమల స్థాపనను ప్రోత్సహిస్తోందని, సెమీ కండక్టర్స్, సోలార్ ప్యానెల్స్, ట్యూబ్స్ అవసరం అవుతున్నాయి. ఒక్క మన రాష్ట్రంలోనే వేల మెగా వాట్ల సోలార్ ప్రాజెక్టులు వస్తున్నాయన్నారు. కేంద్ర ప్రోత్సాహం తీసుకుని, ఇక్కడ దొరికే వనరులను ఉపయోగించుకుని, కోట్లాది రూపాయల పెట్టుబడులు వెచ్చించి పరిశ్రమ స్థాపనకు పూనుకుంటే తొలి దశలోనే కుట్ర పూరితంగా అడ్డుకోవడం, అర్థరహిత విమర్శలు చేయడం అనిల్‌కే చెల్లిందన్నారు. అక్రమ మైనింగ్ పేరిట చైనాలో చెత్త చెదారం డంప్ చేసి, ఏపీలో మైనింగ్ వ్యాపారాన్ని గందరగోళంకు గురి చేసిన కాకాణి, అనిల్‌లు కూటమి ప్రభుత్వంపై.. వీపీఆర్‌పై విమర్శలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పార్లమెంటు ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర రెడ్డి, సీనియర్ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, తాళ్ళపాక అనురాధ, కొండూరు పాలిశెట్టి, మల్లిశెట్టి వెంకటేశ్వర్లు, పనబాక భూలక్ష్మి, అమృల్లా, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పేద మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే సీఎం సంకల్పం



(మొదటి పేజీ తరువాయి)

మరికొంత మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. పేద మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపరచడం, ప్రభుత్వం తరపున వారికి చేయూతనిచ్చి స్వయం ఉపాధితో పారిశ్రామికవేత్తలుగా ఎదగడమే ప్రధాన లక్ష్యంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు మంత్రి వివరించారు. అనంతరం కాంటీన్‌లో తొలి బోణీ చేశారు. కాఫీ, టీ అమ్మి మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించారు. అండగా ప్రభుత్వం ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నందన్, మెప్మా పీడీ రాధమ్మ, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ సీనియర్ నాయకులు వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతా రెడ్డి, టీడీపీ నగర అధ్యక్షులు మామిడాల మధు, తాజా మాజీ కార్పొరేటర్లు, మెప్మా మహిళలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## ఫైరింగ్ కాంపిటీషన్‌లో ప్రతిభ కనబరచిన ఎన్‌సీసీ కేడేట్లు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ, నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్, క్యాంపు కమాండెంట్ గణేష్ గొదంగవే అధ్యక్షతన ఎన్‌సీసీ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్–3 శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలంలోని సరస్వతి నగర్ అక్షర విద్యాలయంలో 8 రోజులు నుంచి నిర్వహిస్తున్నారు. సోమవరం కేడేట్లకు "రహదారి భద్రత నియమాలు" అంశంపై నెల్లూరు సౌత్ ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ అఫ్ పోలీస్ హరికృష్ణ, రమేష్, పెంచల ప్రసాద్, పోలీస్ కానిస్టేబుళ్లు పాల్గొని ఉపన్యసించారు. ప్రతి ఒక్కరు ప్రతి నిత్యం ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, అప్పుడే ప్రమాదాల బారిన పడకుండా అందరం సురక్షితంగా జీవించగమన్నారు. లైసెన్స్, ఆర్‌సి లేకుండా వాహనాలు నడుపుట నేరమని, ద్విచక్ర వాహనాల్లో ఇద్దరికి మించి ప్రయాణించ రాదని, పద్దెనిమిదేళ్లు నిండని వారు వాహనాలు నడుపుటకు అనర్హులని, పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు నడుపుటకు అనుమతించిరాదని, అలా అనుమతిస్తే వారు వాహనాలు వేగంగా నడిపి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. కావున తల్లిదండ్రులు, పెద్దలు పిల్లలు వాహనాలు నడిపే విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు, సీటు బెల్ట్ ధరించకుండా కార్లు నడుపరాదని, రోడ్లు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్స్ దగ్గర మాత్రమే రోడ్లు దాటాలని, రోడ్లుపై ఆటలు ఆడారాదని ట్రాఫిక్ రూల్స్ గురించి అవగాహన కల్పించారు. కేడేట్లకు స్క్వాడ్రాన్ వారీగా డ్రిల్, ఫైరింగ్, ఆటలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల స్కిట్ పోటీలు నిర్వహించారు. ఫైరింగ్ కంపిటీషన్‌లో 25 పాయింట్లకు గాను లోహిత్ సాయి 24 పాయింట్లు, అఖిల్, ప్రసంహీరా 23 పాయింట్లు, తాహీర్ 22 పాయింట్లు, సుశాంత్, బతుల్ 21 పాయిం ట్లు, వశిష్ట 20 పాయింట్లు సాధించారు. వారిని క్యాంపు కమాండెంట్ గణేష్ గొదంగవే అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాంపు అడ్జటెంట్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు, సబ్ లెఫ్టినెంట్ మల్లికార్జున రెడ్డి, థర్డ్ ఆఫీసర్లు మస్తానయ్య, కొండారెడ్డి, విద్యా సాగర్, అరోరా, సాయి శంకరి, దివ్య, పీఐ స్టాఫ్ వైకుంఠం చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, పెట్టీ ఆఫీసర్లు రంజన్, లోకేష్, లక్ష్మణ్, దీపక్, వెంకటేష్, రమణారావు, నవీన్, ఈశ్వర రావు, ఆఫీస్ సూపరింటెండెంట్ ముకుంద సాగర్, షిప్ మోడలింగ్ ఇన్‌స్ట్రక్టర్ ఎస్‌వి.రామన్, కార్యాలయ సిబ్బంది షెహనాజ్ బేగం, కల్పన, సుజాత, 600 మంది ఎన్‌సీసీ కేడేట్లు పాల్గొన్నారు.

# గాంధీ అనుబంధానికి అత్యుత్తమ ప్రతీక పినాకిని సత్యాగ్రహ ఆశ్రమం



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాతో మహాత్మా గాంధీ అనుబంధానికి అత్యుత్తమ ప్రతీక పినాకిని సత్యాగ్రహ ఆశ్రమం. నెల్లూరు తూర్పుగా 10 కిలోమీటర్ల దూరంలో పెన్నా నది ఒడ్డున నెలకొని ఉన్న ఈ ఆశ్రమం గాంధీజీ నాయకత్వం సాగిన జాతీయ స్వాతంత్ర ఉద్యమంలో మహత్తర పాత్ర వహించింది. సత్యాహింసలు ప్రాతిపదికగా గాంధీజీ సాగించిన పోరాటంలో సత్యాగ్రహ సైనికులను తయారు చేసేందుకు ఉద్దేశించిన శిక్షణాలయమే పల్లెపాడు గాంధీ ఆశ్రమం. ఆంధ్ర సీమలోకెల్లా ఇదే తొలి ఆశ్రమం. భారతదేశంలోనే సాబర్మతి తర్వాత రెండవది ఈ ఆశ్రమం.మన జాతీయ వారసత్వానికి ప్రతీకైన ఈ ఆశ్రమాన్ని నేటి తరానికేగాక, భావితరాలకు కూడా స్ఫూర్తిదాయకంగా పునరుద్ధరించుకోవల సిన ఆవశ్యకతను ప్రభుత్వం, ప్రజలు గుర్తించాల్సివుంది. 1915లో తొలి పరిచయంలోనే గాంధీజీని ఎంతగానో ఆకట్టుకున్న సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ కార్యకర్త దిగుమర్తి హనుమంతరావు. ఆయన 1920 నాటికి సాబర్మతి ఆశ్రమంలో ఆదర్శ కార్యకర్తగా రూపుదిద్దుకున్నారు. భరతమాత దాస్య సుంకలాలను తెంచడానికి దారులు వెతుకుతున్న నూనూగు మీసాల యువకుడు చతుర్వేదుల వెంకటకృష్ణయ్య కూడా అప్పుడు సాబర్ మతిలోనే ఉన్నాడు. ఆయనకు హనుమంతరావుతో ప్రగాఢ సాన్నిహిత్యం ఏర్పడింది. గాంధీజీ ప్రేరణపై ఈ ఇరువురు యువకులు సాబర్మతి ఆదర్శంగా శ్రోత్రియ గ్రామమైన పల్లెపాడులో సత్యాగ్రహ ఆశ్రమ నిర్మాణానికి పథక రచన చేశారు. హనుమంతరావు ఆదర్శ వర్తనతో ప్రభావితులైన గుజరాతీ మిత్రు లు కొందరు ఉదారంగా సహాయపడేందుకు ముందుకు వచ్చారు. కృష్ణయ్య తన స్థానిక పరిచయాలతో, పొనక కనకమ్మ సహకారంతో భూసేకరణ, తదితర వనరులు సమకూర్చేందుకు చొరవ తీసుకున్నారు. అప్పటికే నెల్లూరు జిల్లా కాంగ్రెస్ సంఘ నిర్మాణ బాధ్యతలు చేపట్టిన తిక్కవరపు రామి రెడ్డి, వెన్నెల కంటి రాఘవయ్య, ఓరుగంటి వెంకటసుబ్బయ్య తదితరులు ఈ కృషిలో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. గాంధీజీ సూచన మేరకు భారత జాతీయ కాంగ్రెస్ పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందించింది. పెన్న ఒడ్డున సుమారు 20 ఎకరాల భూమి సేకరించి, పాకలు నిర్మించారు. గాంధీజీ చేతుల మీదుగా ఆశ్రమం ప్రారంభోత్సవం జరిగింది. సత్యం, అహింస, ఆస్తే యము, అపరి గ్రహము, బ్రహ్మచర్యము వగైరా నియమాల ఆధారంగా ఆశ్రమం జీవనం, శిక్షణ ఆరంభమయ్యాయి. ఖాదీ ఉత్పత్తి, అస్పృశ్యతా నివారణ, జాతీయ భాష హిందీ ప్రచారం, ప్రకృతి వైద్యం, సర్వధర్మ సమభావం, వయోజన విద్య, స్వయం పోషకత్వానికి ఆలంబనగా వ్యవసాయం వంటి నిర్మాణాత్మక కార్యక్రమాల అమలు ఆరంభమైంది. ఆశ్ర మం ఆస్తుల పరిరక్షణ, నిర్వహణ లకై 25-11- 1921వ తేదీన ఒక ట్రస్టు డీడ్ రిజిస్టర్ అయింది. దిగుమర్తి హనుమంతరావు, దిగుమర్తి బుచ్చి కృష్ణమ్మ, చతుర్వేదల వెంకట కృష్ణయ్య, కొండిపర్తి పున్నయ్యలు జీవితకాలం ట్రస్టీలుగాను, మరో ఇద్దరు ప్రతి యేటా ఎన్నికయ్యే ట్రస్టీలుగాను, ఆరుగురు సభ్యులతో ట్రస్ట్ బోర్డు ఏర్పాటైంది. ఆశ్రమ కార్యకలాపాలు బహు ముఖంగా విస్తరించాయి. ఖాసా సుబ్బారావు, వాడ్రేవు జగ్గరాజు, దిగుమర్తి వెంకట రామమూర్తి, ఇస్కా చెంచయ్య, గుమ్మడిదల సుబ్బారావు, కాళ్ళకూరి వెంక ట్రావు వంటి ఆదర్శ స్వాతంత్ర్య సమరయోధులు తమ తమ కుటుంబాలతో సహా వచ్చి ఆశ్రమ వాసులయ్యారు. దాంతో మహర్దశ ఆరంభమైంది. అదనపు భవన వసతి అవసరమైంది. గాంధీజీ సూచనపై దక్షిణాఫ్రికాలో మహాత్ముని అనుచరుడు, వాణిజ్యవేత్త అయిన రుస్తుంజీ యిచ్చిన భూరి విరాళంతో సుమారు 5000 చదరపు అడుగుల భవంతి నిర్మాణమైంది. దానికి రుస్తుంజీ గాంధీ భవన్ అని పేరు పెట్టారు. గ్రంథాలయం ఏర్పాట యింది. రెంటాల కృష్ణమ్మ, ఆయన భార్య వెంకటసుబ్బమ్మల ఆధ్వర్యంలో ఖాదీ ఉత్పత్తిలో రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచింది. ఈ సందర్భంగా 1923లో జరిగిన ఒక ఘటన ఆశ్రమ వాసుల ఆదర్శ వర్తనకు, గాంధేయ సిద్ధాం తాలలో వారి ప్రగాఢ విశ్వాసానికి, మాటలకు- చేతలకు మధ్య తేడాలేమికి చక్కని నిదర్శనంగా నిలుస్తుంది. మగ వారిలో ఎక్కువమంది బయటికి వెళ్లి వున్న తరుణంలో బందిపోట్ల ముఠా ఒకటి అర్ధరాత్రి వేళ ఆశ్రమంపై దాడి చేసింది. ఆస్తుల పరిరక్షణకే గాక, యువతుల మాన సంరక్షణకై బుచ్చి కృష్ణమ్మ నేతృత్వంలో స్త్రీలే వీరోచితంగా దోపిడీ దొంగలను ప్రతికటించారు.



వారికి రక్తపు గాయాలు కూడా అయ్యాయి. అహింస పిరికి వారి ఆయుధం కాదని వారు ప్రత్యక్షంగా నిరూపించారు. కానీ వారు పోలీసు రిపోర్టు ఇవ్వలేదు, అయినా పోలీసులు దొంగలను అరెస్ట్ చేసి కోర్టు ముందుంచారు. సాక్ష్యమి వ్వడానికి పిలవగా బుచ్చి కృష్ణమ్మ ఆ సొమ్ములు తమ ఆభరణాలను పోలి ఉన్నాయి గాని అవి తమవేనని కచ్చితంగా చెప్పజాలము అన్నారు. ఈ గాంధీయుల క్షమ, సత్య సంధ తలకు దాసోహమైన దొంగలు తమ నేరాలను తామే సవివరంగా కోర్టుకు నివేదించి స్వచ్ఛందంగా శిక్షల పాలయ్యారు. ఆశ్రమ వాసుల ధైర్య సాహసాలను, సిద్ధాంత నిబద్ధతను ప్రశంసిస్తూనే సొమ్ములు సంపదలతో దొంగల దృష్టిని ఆకర్షించడం అభిలాషణీయం కాదని గాంధీజీ వారిని హెచ్చరించారు.

**ఆశ్రమ కార్యకలాపాలు :** ఆశ్రమ కార్యకలాపాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా వికసిస్తున్న ఈ సమయంలో 1925లో ఆశ్రమవా సులందరికి స్ఫూర్తిదాత, ఆదర్శ జీవి అయిన దిగుమర్తి హనుమంతరావు తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. ఎవరెంత చెప్పినా ఆధునిక అల్లోపతి వైద్య సేవల ను పొందడానికి ఆయన నిరాకరించారు. తాను నమ్మిన ప్రకృతి చికిత్సతోనే వ్యాధితో కడకంటా పోరాడుతూ 1926 మార్చిలో ఆయన దివంగతుల య్యారు. ఆదర్శాల కోసం తాను కూడా చేయలేని అపూర్వ త్యాగాన్ని హనుమంతరావు చేసి చూపాడని మహాత్ముడు వేనోళ్ల కొనియాడారు. హనుమంతరావు మరణంతో పినాకిని సత్యాగ్రహ ఆశ్రమ చరిత్రలో ఒక ఉజ్వల ఘట్టం ముగిసింది. కొన్ని సంవత్సరాల క్రితం నుంచి పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమం కొంతమంది వీవీఐపీలు మరియు పలువురు దాతల ఆర్థిక సహకారాలు సహాయాలతో పునరుద్ధరించబడి పర్యాటకులకు బాసటగా నిలుస్తుంది అని చెప్పవచ్చును. అభివృద్ధి చెందిన గాంధీ ఆశ్రమం యొక్క చరిత్రను మరల మరొక వార్తగా రాయాల్సి ఉంది.

## వరద కాలువకు వందల కోట్లు ఖర్చు చేశారు

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** సోమశిల అదనపు హెడ్ రెగ్యులేటర్ ను నేషనల్ డ్యాం సేఫ్టీ అధికారుల పర్యవేక్షణలో నిర్మించాలని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ సోమశిల ప్రాజెక్టు పర్యవేక్షణ అధికారి వెంకటరమణారెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమశిల బికండలేరు వరద కాలువను 12 వేల క్యూసెక్కుల నుండి 24 వేల క్యూసెక్కులకు విస్తరణ చేస్తున్నారు. సోమశిల నుండి 24 వేల క్యూసెక్కుల నీటి విడుదల కొరకు నూతన హెడ్ రెగ్యులేటర్ నిర్మించాల్సి ఉంది. హెడ్ రెగ్యులేటర్ నిర్మాణా విధానం ఖరారు కాకుండానే వరదకాలవ విస్తరణకు వందల కోట్లు ఖర్చు చేశారు. పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్ విస్తరణలో నూతన హెడ్ రెగ్యులేటర్‌కు స్థలం ఉన్నందున సులభంగా నిర్మించారు. సోమశిల డ్యాంలో అలాంటి పరిస్థితి లేదు. సోమశిల డ్యాం ప్రాజెక్ట్ రిపోర్టులో పవర్ హౌస్ లేదు. సోమశిల డ్యామ్ పూర్తి అయిన 10 సంవత్సరాల తర్వాత పవర్ హౌస్ నిర్మించారు. ఆ సమయంలో బ్లాస్టింగ్ వలన డ్యాంలో కెమికల్ ట్రీట్మెంట్ జరిగిన విషయం పరిగణలోకి తీసుకోవాలి. 40 సంవత్సరాల సోమశిల డ్యాం కట్టడానికి సమస్యలు తలెత్తకుండ హెడ్ రెగ్యులేటర్‌ను నిర్మించాలి. కొండలో టన్నల్ నిర్మించాలని ప్రాజెక్ట్ అధికారులు నిర్ణయించారు. నేషనల్



డ్యాం సేఫ్టీ అధికారుల నివేదికను అనుసరిస్తూ నిర్మాణం చేపట్టాలని బిజెపి నేతలు డిమాండ్ చేశారు. జాతీయ భద్రతా కమిటీ సభ్యులు పరిశీలించేంత వరకు హెడ్ రెగ్యులేటర్ పనులు చేపట్టరాదని పర్యవేక్షణ అధికారికి బిజెపి నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోట్లూరు శ్రీనివాసులు, నరాల సుబ్బారెడ్డి, రఘురామయ్య, రత్నం నాయుడు, నాగలక్ష్మి, పద్మావతి, శిరీష, నారాయణ ఏవి సుబ్బయ్య, కళ్ళు భాస్కర్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పాఠశాలలో ఇద్దరు టీచర్లు ఉండాలి : ఏపీటీఎఫ్

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చూడాలని, అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి ఒకేలా ఉండేలా చర్యలు చేపట్టాలని ఏపీటీఎఫ్ ఉద్యమిస్తోందని ఆ శాఖ నెల్లూరు జిల్లా (గౌరవ) అధ్యక్షులు పి.తిరుపతిరెడ్డి ప్రకటించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖ ఇచ్చిన దశలవారీ ఉద్యమంలో భాగంగా సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థలో అసంబద్ధ విధానాలు వెంటనే సరిచేయాలని కోరారు. 12వ పీఆర్సీ కమిషన్ వెంటనే నియమించి ఐఆర్. 30 శాతం ప్రకటించాలని నినాదాలిచ్చారు. అనంతరం ఉదయగిరి తహసిల్దారుకు మెమోరాండం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ నాయకులు డి.మాల్యాద్రి, ఎండీ ఖాజా, ఎస్.ఓబులేసు ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, సీతారాంపురం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షబ్బీర్, నాగేశ్వరరావు, రమేష్, మాధవరాజు, మాల్యాద్రి, బాలకృష్ణ, రామసుధాకర్, సురేష్ బాబులు పాల్గొన్నారు.



## అక్రమ లేఅవుట్లు పై నివేదిక ఇవ్వండి

▸ నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

**నెల్లూరు టౌన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం అక్రమ లేఅవుట్లు పై నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడు తూ.. నెల్లూరు నుడా పరిధిలో ఉన్న అక్రమ లేఔట్, అప్రూవల్ లేఔట్‌లు పరిశీలించి వాటి స్థితిగతులు అనగా 45 అడుగుల రోడ్లు 30 అడుగుల రోడ్లు అప్రూవ్డ్ లైట్లు వేసి ఉన్నారా లేదా ఓపెన్ స్పేస్ వదిలేరా, ఎన్ని భవనాలు నిర్మించారు. వాటి స్థితిగతులు తెల్పులని సర్వే బృందాలకు సూచించారు. అక్రమ లేఔట్‌లో వేసిన యజమానులను బెదిరించరాదని అన్నారు. నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ కె.హిమబిందు మాట్లాడుతూ.. డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ వారు ఇచ్చిన ఫార్మేట్‌ల ప్రకారం అక్కడ ఉన్న సర్వేరు, సచివాలయం సిబ్బంది, తహసిల్దార్, విఆర్ఓ ఆర్డీవోల ఆఫీసులకు వెళ్లి తగు సమాచారం సేకరించి ప్రభుత్వం ఇచ్చిన ఫార్మేట్‌ను పూర్తి చేయాలని సూచించారు. ప్రతిరోజు సర్వే చేసిన సంబంధిత సూపర్వైజర్ వారికి చేరవేసి ప్రభుత్వం వారికి నివేదిక ఇవ్వాలని అన్నారు. ఈ సమావేశంలో పైలెట్ ప్రాజెక్టు కమిటీ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

## తాత్కాలికంగా సర్పంచ్ చెక్ పవర్ రద్దు

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండలం కాటేపల్లి పంచా యతీ సర్పంచ్ నిధుల దుర్వినియోగం అభియోగం పై విచారణ జరిపి తాత్కాలికంగా చెక్ పవర్‌ను జిల్లా పంచాయతీ అధికారి రద్దు చేసినట్లు ఎంపీడీవో కే శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. కాటేపల్లి పంచాయతీ నిధుల దుర్వినియోగంపై పంచాయతీ కార్యదర్శిపై విచారణ జరిపి చర్యలు తీసుకుని నేపథ్యంలో సదరు గ్రామపంచాయతీ సర్పంచ్‌పై చర్యలు తీసు కోవాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు కృష్ణ మాదిగ అందజేసిన ఫిర్యాదు మేరకు కందుకూరు డివిజనల్ పంచాయతీ అధికారి విచారణ చేపట్టి నివేదిక సమర్పించడంతో జిల్లా పంచాయతీ అధికారి విజయ లక్ష్మికు తాత్కాలికంగా చెక్కు పవర్‌ను రద్దు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# కోనకి బ్రహ్మోత్సవం శోభ

- చలవ పందిళ్ళు, విద్యుత్ దీపాలంకరణలతో మెరిసి పోతున్న కోన
- 8 నుంచి 14 వరకు నిర్వహణ
- భక్తులకు సౌకర్యాల కల్పనకు ఏర్పాట్లన్నీ పూర్తి
- బ్రహ్మోత్సవ ఏర్పాట్ల పై మంత్రి ఆనం ప్రత్యేక శ్రద్ధ



**రాపూరు, మేజర్‌న్యూస్ :** కొనలోని వెలసియున్న ఆలయం ప్రత్యేక మైంది. ఇది రాష్ట్రంలోని నవ నారసింహ క్షేత్రాలలో తొమ్మిదోదిగా చెప్పబడుతోంది. ఇక్కడకి రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో వస్తూ ఉంటారు. భక్తులే కాదు పీఠాధి పతులు, ప్రముఖులు కూడా ఇక్కడకి విచ్చేస్తుంటారు. ఇక్కడ చెంచు లక్ష్మీ అమ్మ వారు ఏక శిలా రూపంలో వెలసి భక్తుల ను అనుగ్రిహిస్తున్నారు. అందుకే ఈ క్షేత్రా నికి పెనుశిల క్షేత్రంగా పిలవబడి కాల క్రమంలో పెంచల కోనగా మారిందని స్థలపురాణం చెబుతోంది. నెల్లూరుకి 90కి. మీ దూరంలో సముద్ర మట్టానికి 3000 అడుగుల ఎత్తులో ఉండే ఈ క్షేత్రం దిన దినాభివృద్ధి చెందుతూ వుంది. ఈ ఆలయం ఎప్పుడు కట్టారు అనే దానికి ఖచ్చితమైన ఆధారాలు లేకున్నా సుమారు 8 వందల ఏళ్ళ నాటిది అయ్యింటుందని భావిస్తున్నారు. కోన స్థల పురాణం ప్రకారం నృసింహ స్వామి వారు జ్వాలా రూపంలో ఇక్కడకి వస్తే ఆ ఉగ్ర రూపాన్ని శాంతింప జేయడానికి దేవతలందరూ లక్ష్మీ దేవి అమ్మ వారిని ప్రార్థించగా ఆమె చెంచు లక్ష్మీగా అవతారం దాల్చి శాంతింప చేసారని, వారిద్దరు ఇక్కడే శిలా రూపంలో కొలువైనారని పండితులు చెబుతున్నారు. అలాగే కొండ పై నుంచి పారే నీటి యేరు లను పరిశీలిస్తే ఇక్కడ కణ్వ మహర్షి తపస్సు చేయగా ఆయన పేరు మీద యేరుకి కన్వముఖి అనే పేరు వచ్చింది అని అది కాల క్రమంలో కండలేరుగా పిలవపడుతోంది అని ప్రతీతి.

**ఎటు చూసినా కొండలు.. సెల యేరులు.. చుట్టూ పచ్చదనం పరిచినట్లు వుండే ఆహ్లాదకరమైన వాతావరణం. వాటి మధ్యలో శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానం. ఇదీ నెల్లూరు జిల్లా రాపూరు మండలం పెంచల కోన లో వెలసియున్న లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల పై మేజర్ న్యూస్ ప్రత్యేక కథనం.**

**బ్రహ్మోత్సవ నిర్వహణ ఇలా.. :** బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 8న స్వామి వారు ఉభయ దేవే రులతో కోన నుండి 7 కి.మీల దూరంలో ఉన్న గోనుపల్లి గ్రామానికి చేరుకొంటారు. మార్గ మధ్యంలో గొల్లబోయికి మొదటి దర్శనం అనుగ్రహిస్తారు. దీంతో బ్రహ్మో త్సవాలకు అంకురార్పణ జరిగినట్లు భావి స్తారు. తిరిగి సాయంత్రం కోనకి చేరుకొంటారు. 9న ధ్వజారోహణం.. 10న హంస వాహన సేవ, హనుమంతు సేవ 11న స్వామి జయంతిని పుర స్కరించుకొని సింహ వాహన సేవ, బంగారు గరుడ సేవ, 12న కల్యాణోత్సవం, రథో త్సవం, గజ వాహన సేవ 13న వసంతోత్సవం, చక్ర స్నానం తెప్పోత్సవం, అశ్వ వాహన సేవ ధ్వజారోహణం నిర్వహిస్తారు. 14న ఉత్సవ మూర్తులను గోనుపల్లికి తీసుకొచ్చి సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించి తిరిగి కోనకి చేరుస్తారు. అంతటితో కార్యక్రమం ముగుస్తుంది. బహ్మోత్స వాలకి ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపి అధికారులు, ఫెస్టివల్ కమిటీ సభ్యులులకి దిశా నిర్దేశం చేశారు.

## విద్యార్థులకు భాషా నైపుణ్యం తప్పనిసరి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ప్రస్తుతం విద్యార్థులకు భాషపై పట్టు అవ సరం అని గ్రంథాలయ అధికారి జ్యోతి కొండయ్య తెలిపారు. గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరం ఏడవ రోజు స్పోకెన్ ఇంగ్లీష్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్ల భాష అంటే పిల్లలు భయపడతారని అన్ని భాషల కంటే త్వరగా ఆంగ్ల భాష నేర్చుకునే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం స్పోకెన్ ఇంగ్లీష్ అంశంపై శిక్షణా అంశాలు కూడా ఉన్నాయన్నారు. వాటిని తూచా తప్పకుండా అనుసరించి నట్లయితే ఆంగ్ల భాషను సులభంగా నేర్చుకునే వీలుంటుందన్నారు. అలాగే ఆంగ్లం వ్యాకరణాంశాలను నేర్చుకోవాలని భవిష్యత్తులో ఉపాధి పొందేందుకు ఆంగ్ల భాష ఎంతో ఉపకరిస్తుందన్నారు. దేశ విదేశాలలో ఆంగ్ల భాష హిందీ భాషలో నేర్చుకున్నట్లయితే ఎక్కడైనా ఉపాధిని పొందవచ్చు అన్నారు. కాబట్టి విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని తెలిపారు. భాష నైపుణ్యాలను ఇప్పటి నుండే అలవర్చు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉన్నారు.

## ప్రయాణీకుల భద్రతే ముఖ్యం : న్యాయమూర్తి కె.వాణి




**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) కార్మికులు ప్రయాణీకుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మితిమీరిన వేగం నిర్లక్ష్య స్వభావం అస్సలు పనికి రాదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి హితవు పలికారు. రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం నెల్లూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ సూచనలతో న్యాయ మూర్తి వాణి ఆర్టీసీ ప్రాంగణంలో మేడే వారోత్సవాల సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు జరిపారు. ఈ సదస్సులో న్యాయమూర్తి వాణి మాట్లాడుతూ.. ఎంతో మంది ప్రయాణీకుల ప్రాణాలు డ్రైవర్ల నైపుణ్యంపై ఆధారపడి ఉంటుందని ప్రయాణికులం భద్రతతోపాటు ఆర్టీసీ కార్మికుల కుటుంబాల భద్రత కూడా ఆర్టీసీ డ్రైవర్ల పై కండక్టర్లపై ఆధారపడి ఉంటుందని న్యాయమూర్తి పేర్కొన్నారు. నడిరోడ్డుపై మీ ప్రవర్తన మీ కుటుంబాన్ని నడిరోడ్డుపై నిలబెట్టకుండా కాపాడుతుందని కూడా న్యాయమూర్తి పేర్కొన్నారు. మహిళా కార్మికులందరికీ ప్రత్యేకమైన సదుపాయాలు వసతులు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఆర్టీసీ యాజమాన్యంపై ఉంటుందని న్యాయమూర్తి పేర్కొన్నారు. జీతభత్యాలు బోనస్ అలవెన్సులు కార్మికులకు అందవలసిన అన్ని రకాల సదుపాయాలు క్రమం తప్పకుండా ఇవ్వాల్సి ఉంటుందని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఏ కార్మికునికి అన్యాయం జరిగిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న లోక్ అదాలత్ నందు ఫిర్యాదు చేయవచ్చని సంబంధిత వ్యక్తులను పిలిపించి కార్మికులకు చట్ట ప్రకారం తగు న్యాయం చేయగలమని న్యాయమూర్తి పేర్కొన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 15100కు కూడా కాల్ చేసి తగు సూచనలు సలహాలు పొందవచ్చని న్యాయమూర్తి వాని సూచించారు ప్రతి కార్మికుడు సంస్థ ఎదుగుదలకు దోహదపడాలని సంస్థ లాభాల బాటలో పయనించేలా చూడాలని అప్పుడే వారి హక్కులన్నీ నెరవేర్చుకోగలరని కూడా న్యాయమూర్తి వాణి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులతో పాటు ఆర్టీసీ యాజమాన్యం తరపున 1 డిపో మేనేజర్ మురళి టూ డిపో మేనేజర్ యాదవ్ పర్సనల్ ఆఫీసర్ కె రమణ చీఫ్ సెక్రటరీ ఇన్స్పెక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధితో మహిళల ఆర్థిక స్వావలంబన

- తృప్తి క్యాంటీన్ ప్రారంభోత్సవంలో విబిఆర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధ్యమవుతుందని, ప్రభుత్వ సహకారంతో తృప్తి క్యాంటీన్ ఏర్పాటు చేసుకుని మహిళలు ఆర్థికంగా ముందుకు సాగడం అభినందనీయమని టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి అన్నారు. నగరంలోని స్థానిక ఆత్మకూరు బస్టాండ్ వద్ద సోమవారం మంత్రి నారాయణ చేతుల మీద జరిగిన తృప్తి కాంటీన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి హాజరయ్యారు. తెలుగుదేశం పార్టీ నాయకులు మహిళలు, నిర్వాహకులతో కలిసి వేమిరెడ్డి క్యాంటీన్‌ని పరిశీలించారు. అనంతరం విజయ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా నిలదొ క్కుకునేందుకు ఇది ఒక మంచి అవకాశం అన్నారు. తమ కాళ్ళ మీద తాము నిలబడడమే కాకుండా పది మందికి ఉపాధి కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ వారిని ఆదర్శంగా తీసుకొని నెల్లూరు నగరంలోని మరిన్ని ప్రాంతాల్లో క్యాంటిన్లను ప్రారంభించాలని వేమిరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో క్యాంటీన్ నిర్వాహకులు, మహిళా శక్తి టీం, ఎన్ టీం సభ్యులు, టీడీపీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా హక్కు చట్టం ద్వారా ఉచిత ప్రవేశాలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** విద్యాహక్కు చట్టం 2009 సెక్షన్ 12-1సీ ప్రకారం ప్రైవేటు అన్ ఎయిడేడ్ పాఠశాలల్లో 25శాతం ఉచిత ప్రవేశాల కల్పిస్తున్నట్లు ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారి- షేక్ మస్తాన్ వలి పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. అన్ని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటవ తరగతికి సంబంధించి 25శాతం ఉచిత ప్రవేశాలు ఉంటాయని తెలియజేశారు. ఈ ఉచిత ప్రవేశాలకు అర్హులు ఎవరంటే ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న అనాధ పిల్లలు, హెచ్ఐవి బాధ్యత పిల్లలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంబంధించిన పిల్లలు మరియు ఆర్థికంగా వెనుకబడిన మైనారిటీ, బీసీ, ఓసి పిల్లలు అర్హులని తెలియజేశారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి గ్రామీణ ప్రాంతాలలో సంవత్సరిక ఆదాయం 120000, పట్టణ ప్రాంతాలలో ఒక లక్ష 44 వేల రూపాయలు సంవత్సరిక ఆదాయం లోపల ఉండాలని తెలియజేశారు. ఏప్రిల్ 28 నుండి మే 15 వరకు గ్రామ వార్డు సచివాలయాల్లో, ఇంటర్నెట్ సెంటర్లలో, మండల విద్యాశాఖ అధికారి వారి కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపిక విధానం లాటరీ ద్వారా జరుగుతుందని తెలియజేశారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

## మజ్జిగ చలివేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని విఆర్సి, కొత్త హాల్ సెంటర్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్సీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి ఎండల నేపథ్యంలో ఈ మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరు ఎండలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పేర్నటి కోటేశ్వర్ రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఊటుకూరు నాగార్జున, మజ్జిగ జయ కృష్ణారెడ్డి, అంజా హుస్సేని, మున్వర్ భాష మల్లీ నిర్మల, శివలంకి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ జయంతి నాటికి స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యం

## రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అక్టోబర్ 2 గాంధీ జయంతి నాటికి స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా రాష్ట్రంలో పేరుకున్న చెత్తను తొలగించేలా చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. సోమవారం ఉదయం నెల్లూరు రూరల్ మండలం అల్లీపురం డంపింగ్ యార్డ్ వద్ద బయోమైనింగ్ రీసైక్లింగ్ యూనిట్‌ను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. జిగ్మా గ్లోబల్ ఎన్విరాన్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వేగంగా రీసైక్లింగ్ పనులు జరుగుతున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం ఆర్థికవ్యవస్థను నిర్వీర్యం చేసిందని, పదిలక్షల అప్పుతో పాటు 85 లక్షల టన్నుల చెత్త మిగిల్చి వెళ్లిందన్నారు. రాష్ట్రంలో 6500 టన్నుల చెత్త ప్రతి నిత్యం వస్తుందన్నారు. చెత్త తొలగింపు కాంట్రాక్టులో కూడా వైఎస్సార్సీపీ నిర్లక్ష్యం వహించిందన్నారు. తమ ప్రభుత్వం రాగానే పారదర్శకంగా టెండర్లు పిలిచామన్నారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో దొంతాలిలో డంపింగ్ యార్డులో 3 లక్షల టన్నులు, అల్లీపురం డంపింగ్ యార్డులో 30 వేల టన్నులు చెత్త ఉందన్నారు. అల్లీపురం డంపింగ్ యార్డు తొలగింపుకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి 20 ఏళ్లుగా ప్రయత్నిస్తున్నారన్నారు. అల్లీపురం డంపింగ్ యార్డులో ఇప్పటికే 5 వేల టన్నుల చెత్తను రీసైక్లింగ్ చేసారన్నారు. మరో రెండు నెలల్లో మొత్తం చెత్త తొలగించి అన్ని హంగులతో పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తం వున్న మున్సిపాలిటీల పరిధిలో ఉన్న చెత్తను తొలగించి రీసైక్లింగ్ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ నందన్ ,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ సీనియర్ నాయకులు వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతా రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# గ్రామీణ విద్యార్థుల వరం.. ఈస్ట్ వుడ్స్ సీబీఎస్ఈ ఇంగ్లీష్ స్కూల్

## ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఈ ప్రాంత గ్రామీణ విద్యార్థులకు ఒక వరంగా ఈస్ట్ వుడ్స్ సీబీఎస్ఈ ఇంగ్లీష్ స్కూల్ నిలుస్తుందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. ఆదివారం సాయంత్రం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో మారుతున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా విద్యా వ్యవస్థ కూడా మారుతుందని ఆ మార్పుకు అనుగుణంగా ఈస్ట్ వుడ్స్ సీబీఎస్ఈ ఇంగ్లీష్ పాఠశాలలో అనేకమైన మార్పులు చేస్తుందన్నారు. విద్యార్థులకు అవసరమైన ఐఐటి నీట్ వేదిక్ గణితం అబాకస్ జేఈఈ ఇలాంటి ఫౌండేషన్ కోర్సులను ఇప్పటినుండే విద్యార్థులకు బోధించడం శుభ పరిణామం అన్నారు. పాఠశాల నేమ్ బోర్డును అలాగే బ్రోచర్ను ఆవిష్కరించారు పాఠశాల చైర్మన్ పి.మధుబాబు ఆయనకు పుష్పగుచ్చాన్ని అందించి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అదేవిధంగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సాంకేతిక విద్యను ప్రోత్సహిస్తూ విదేశాలకు వెళ్లేందుకు మార్గం సులభతరం చేశారన్నారు ఆ క్రమంలో ఎన్ఆర్ఐ గా అమెరికాలో గొప్ప జీతంతో విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నామని మాలాగా ఎందరో మన తెలుగు రాష్ట్రాల నుండి అమెరికాలో గొప్పగా సంపాదించిన వారు ఉన్నారన్నారు. కానీ పుట్టిన గడ్డకు ఏదో ఒక మేలు చేయాలని ఆలోచన రావడం ఉదయగిరి నియోజకవర్గం ప్రజలకు సేవ చేయాలని ఆలోచనతో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ 25 సంవత్సరాలు ఏర్పాటు చేశామన్నారు. అప్పటినుండి అనేకమైనటువంటి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి కొనసాగిస్తున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా ఈ పాఠశాల చైర్మన్ మధు కూడా ఎన్నారైగా ఉండి అమెరికా తరహా లాంటి విద్యను నా ప్రాంత విద్యార్థులకు అందించాలని తలంపుతో ఈ పాఠశాలను స్థాపించి అతి కొద్ది సమయంలోనే సాధ్యం కానీ సీబీఎస్ ఈ సర్టిఫికెట్‌ను సాధించడం గొప్ప విషయం అన్నారు. ఈ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయ బృందం మెరుగైన విద్యను అందిస్తూ విద్యార్థులను బంగారు బాటలో నడిచే విధంగా చేయాలని సూచించారు. అనంతరం పదవ తరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు 590 సాధించిన తనుజను అలాగే స్కిప్పింగ్ నందు జాతీయ స్థాయిలో ప్రథమ ద్వితీయ స్థానాలను సాధించిన మహిత్ భవ్యశ్రీలను అభినందించారు. శ్రీ వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ ఎం.గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉంటుందని ఆయన అన్నారు అలాంటి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసుకోవడంలో ఈ పాఠశాల చైర్మన్ మధుబాబు గొప్ప తన మన్నారు. విద్యార్థులను సరైన మార్గంలో నడిపించేందుకు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాలన్నారు. విద్యార్థులకు అవసరమైన వస్తువులను కల్పిస్తూ వారికి నాణ్యమైన విద్యను అందించడమే పాఠశాల ధ్యేయంగా కలిగి ఉండటమే ఉత్తమ లక్షణం అన్నారు. తెలుగుదేశం రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బొల్లినేని రామారావు మాట్లాడుతూ.. ఈ ప్రాంత వాసులకు నాణ్యమైన విద్యను అందించేందుకు మధుబాబు ఈ పాఠశాలను ఏర్పాటు చేయడం, సాంకేతికపరమైన విద్యను అందించేందుకు కృషి చేయడం శుభ పరిణామం అన్నారు. గండిపాలెం రెసిడెన్షియల్ స్కూల్ విశ్రాంత ప్రిన్సిపాల్ వెంగయ్య మాట్లాడుతూ.. విద్యార్థులకు మొదటి నుండి గణితం సైన్స్ ఇంగ్లీష్ భాషల యందు ప్రావీణ్యత రావాలన్నారు. ఏ ఒక్క పాఠ్యాంశంలో మెరుగ్గా ఉన్నప్పుడు మిగిలిన అంశాలలో కూడా మెరుగ్గా ఉంటారని ఆయన తెలిపారు. ఈస్ట్ వుడ్స్ సీబీఎస్ఈ ఇంగ్లీష్ స్కూల్ నందు ఇలాంటి పరిస్థితులు ఉన్నాయని విద్యార్థులకు ఇది ఒక దేవాలయంగా వరాలను ఇస్తుందన్నారు. రాబోయే కాలంలో వచ్చే మార్పులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కలిగిరి తెలుగుదేశం మండల అధ్యక్షులుబిజ్జం కృష్ణారెడ్డి, ఎన్నం రామచంద్రారెడ్డి వై.రమణారెడ్డి గూడా నర్సారెడ్డి చింతం వెంకటసుబ్బారెడ్డి నరసింహనాయుడు బిజెపి మండల అధ్యక్షులు డేగ మధు యాదవ్ ఇతర దేశం నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులు మధుబాబు బంధుమిత్రులు తదితరులు ఉన్నారు.

# విలేజ్ డిజిటల్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించండి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** నియోజకవర్గంలో ఉన్న విలేజ్ సెక్రటేరియట్ సిబ్బంది సమస్యలను తీర్చాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కి తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ విలేజ్ సెక్రటేరియట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. డిజిటల్ అసిస్టెంట్ ప్రమోషన్ ఛానెల్ మార్పు చేయాలని కోరారు. బీటెక్ ఎంటెక్ పీహెచ్‌డీ చదివి టెక్నికల్ సిలబస్ మీద టెక్నికల్ పరీక్ష రాసి సెలెక్ట్ అయినామాకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయాన్ని ఐటి శాఖ మంత్రి లోకేష్ బాబు దృష్టికి తీసుకెళ్లి న్యాయమైన మా కోర్కెలు తీర్చాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో మహేష్, సునీల్, వనజా, మాధవి, గోపి రాజు, వెంకట సుబ్బయ్య, అబ్దుల్ సమద, నస్రీన్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# స్టార్ బేకరీ అండ్ కేఫ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కాకర్ల



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని బంగ్లా సెంటర్ నందు కేరళ వారిచే నూతనంగా అన్ని హంగులతో ఏర్పాటు చేసిన స్టార్ బేకరీ అండ్ కేఫ్‌ను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతులమీదుగా ఆదివారం మధ్యాహ్నం ప్రారంభించారు. రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించిన అనంతరం ప్రారంభం కేకును కట్ చేశారు. షాపు యజమానులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కి తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి చెందుతున్న ఉదయగిరి నియోజకవర్గంలో ఈ సెంటర్లో అన్ని హంగులతో ఇదివరకు ఈ ప్రాంతంలో లేని విధంగా కేరళ వారిచే రుచికరమైన కేఫ్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శుభ్రత నాణ్యత ప్రమాణాలను పాటించి దినదిన అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ అవకాశాన్ని మండల వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, మాజీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, సీనియర్ నాయకులు గణపం సుదర్శన్ రెడ్డి, మంచాల శ్రీనివాసులు నాయుడు, కడియాల వెంకటేశ్వర్లు, కాకర్ల వెంకట్ తదితరులు ఉన్నారు.

## మంత్రి, ఎంపీలకు బ్రహ్మోత్సవ వేడుకల ఆహ్వానం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండలం నల్లగొండ్ల గ్రామంలో వెలసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు 9వ తేదీన ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర దేవాదాయ శాఖ మాత్యులు ఆనం రామనారాయణ రెడ్డి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలను బ్రహ్మోత్సవ వేడుకలకు రావలసిందిగా నల్లగొండ్ల గ్రామస్తులు నెల్లూరులో కలిసి ఆహ్వానించారు. ఆలయ ఈఓ శాంతయ్య అంకినపల్లి ఓబుల్ రెడ్డి అన్నపురెడ్డి తిరుపాల్రెడ్డి బొల్లా సుబ్రహ్మణ్యం అంకెన పల్లె పెంచల్ రెడ్డి అన్నపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి లెక్కల మురళీ రెడ్డి ప్రధాన అర్చకులు పరాంకుశం సత్యనారాయణ చార్యులు అర్చకులు రవికుమార్ ఇతర దేవస్థాన కమిటీ సభ్యులు తదితరులు ఆహ్వానించిన వారిలో ఉన్నారు.

## స్వచ్ఛఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు పట్టణంలోనే మొదటి పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బందికి, ట్రాఫిక్ పోలీస్ వారికి వేసవికాలంలో ప్రజలు ప్రభుత్వ అధికారులు వృద్ధులు, మహిళలు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి క్షుణ్ణంగా వివరించారు. అనంతరం వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మొదటి పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ ఎండి. ఫిరోజ్ మున్సిపల్ శాఖ శానిటరీ ఇన్స్పెక్టర్, శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీలు పాల్గొన్నారు.



## రైల్వే స్థలాల నిర్వాసితులకు..

# తాత్కాలికంగా టిడ్కో గృహాల కేటాయింపు

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని స్థానిక 5,52 డివిజన్లు పాత చెక్ పోస్టు, బర్మాషెల్ గుంట, రైల్వే కట్ట వీధి ప్రాంతాల్లోని రైల్వే స్థలాల నిర్వాసితులకు టిడ్కో గృహాల్లో తాత్కాలిక వసతిని కల్పించి, వీలైనంత త్వరగా ప్రత్యామ్నాయం కల్పించనున్నామని కమిషనర్ వై.ఓ నందన్ తెలియజేసారు. రైల్వే శాఖ రైల్వే స్థలాల ఆక్రమణలను తొలగిస్తున్నారన్న సమాచారంతో స్థానిక రైల్వే వీధి రోడ్డు, పాత చెక్ పోస్టు, బర్మా షెల్ గుంట ప్రాంతాలలో సోమవారం పర్యటించి నిర్వాసిత ప్రజలను కమిషనర్ కలుసుకున్నారు. వారందరికీ తప్పనిసరిగా ప్రత్యామ్నాయం చూపిస్తామని తెలిపారు. అనంతరం రైల్వే స్థలాల నిర్వాసితులు, ప్రజా ప్రతినిధులు, టిడ్కో, హౌసింగ్ విభాగం అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ఆదేశాల మేరకు రైల్వే స్థలం నిర్వాసితులు మొత్తం 150 మంది కుటుంబాలకు అల్లీపురం, వెంకటేశ్వరపురం ప్రాంతాల్లోని టిడ్కో గృహాలలోని 300 చదరపు అడుగుల గృహాలను తాత్కాలికంగా కేటాయించనున్నామని తెలిపారు. నిర్మాణాలు పూర్తయిన తర్వాత కూడా లబ్ధిదారులు స్వాధీనం చేసుకోని గృహాలను గుర్తించి, మూడు నెలల కాల పరిమితితో ఆఫిడవిట్ ఆధారంగా ఆయా గృహాలను కేటాయించనున్నామని తెలిపారు.జగనన్న కాలనీలో మంజూరైన స్థలాలలో లబ్ధిదారుల భాగస్వామ్యంతో పాటు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా నిర్మాణాలను పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయనున్నామని కమిషనర్ తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన నూతన విధానంలో ఎస్టి




సామాజిక వర్గానికి 75 వేలు, ఎస్సీ బీసీ వర్గాలకు 50వేల వంతున ఆర్థిక ప్రోత్సాహం లభిస్తుందని కమిషనర్ వివరించారు. గృహాల నిర్మాణాలకు అవసరమైన పనులను వెంటనే చేపట్టి, నిర్దేశించిన కాలం లోపల నిర్మాణాలు పూర్తయ్యేలా కాంట్రాక్టర్లను పర్యవేక్షించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. టిడ్కో గృహ సముదాయాలలో విద్యుత్ వైరింగ్, ప్లాస్టింగ్, మంచినీటి సరఫరా తదితర మౌలిక వసతులను వెంటనే కల్పించి, లబ్ధిదారులకు గృహాలను కేటాయించేలా అధికారులు పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు.రైల్వే స్థలాల నిర్వాసితులందరూ తాత్కాలికంగా టిడ్కో గృహాలలో వసతి పొందేలా ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ అన్ని విభాగాల అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక 5వ డివిజన్ కార్పొరేటర్ రవిచంద్ర, అర్బన్ తహశీల్దార్ షఫీ మాలిక్, నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ డైరెక్టర్ మాధురి, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ పద్మజ, టిడ్కో డీఈ, హౌసింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పొదలకూరులో జోరుగా నకిలీ సిగరెట్ల విక్రయాలు

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలో నకిలీ సిగరెట్ల దందా జోరుగా సాగుతోంది. గుట్టుచప్పుడు కాకుండా బ్రాండెడ్ ముసుగులో ఫేక్ సిగరెట్లు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతు న్నారు. బిహార్, గుజరాత్, ఉత్తర ప్రదేశ్‌తో పాటు మయన్మార్‌లో నకిలీ సిగరెట్లు పురుడు పోసుకున్నట్లు సమాచారం. అచ్చం బ్రాండెడ్ సిగరెట్లకు ఏమాత్రం తీసిపోని విధంగా నకిలీ సిగరెట్లు చుట్టేస్తున్నారు. బ్రాండెడ్ పెట్టెలో విక్రయిస్తుండటంతో వినియోగ దారులు కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ నకిలీ సిగరెట్ల వ్యాపారం జోరుగా సాగుతుండటం వాస్తవ పరిస్థితికి అద్దం పడుతోంది. నకిలీ సిగరెట్లను కొరియర్లు, భారీ వాహనాల్లో రవాణా చేస్తున్నారు. నిబంధ నల ప్రకారం కొరియర్ సంస్థలు పార్శిల్ పంపే వారి వివరాలు, అందులో ఏ వస్తువు ఉందో తెలుసుకోవాలి. అయితే



కొన్ని కొరియర్ సంస్థలు నిబంధనలను గాలికి వదిలేయడంతో ఫేక్ సిగరెట్లు హద్దులు దాటుతున్నా యి. తెల్లవారు జామున శివారు ప్రాంతాల్లోకి సరుకును తీసుకొ స్తారు. అక్కడ నుంచి రిటైలర్లు, డీలర్లు ఆటోల్లో దుకాణాలకు తరలించుకుంటారు. సిగరెట్ల అక్రమ రవాణాను నిలువరించేందుకు పోలీసులు, జీఎస్టీ అధికా రులు అప్పుడప్పుడు ప్రయత్నిస్తున్నా ఎలాంటి ఉపయోగం లేదు. సీజీఎస్టీ, కస్టమ్స్ అధికారులు సరుకు పట్టుకున్నప్పుడు చేసే హడావుడి కేసు దర్యాప్తు లో చూపించటం లేదు. డ్రైవర్లను, కమీషన్ ఏజెంట్లను మాత్రమే అరెస్ట్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. అసలు మాఫియా వెనకున్న కీలక నిందితు లను పట్టుకోకపోవడం వల్లే దర్జాగా దందా సాగుతోందన్న ఆరోపణలున్నాయి.

# ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో సోమవారం ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ప్రదేశం రాష్ట్ర శాఖ పిలుపుమేరకు తాలూకా కేంద్రాలలో నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం కావలి తహసిల్దార్ కార్యాలయం ఎదురుగా ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయుల బదిలీలు, రియఫోర్స్మెంట్ పిఆర్సిలో భాగంగా ఇంటీరియర్ రిలీఫ్ ఇవ్వడం, పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఈ కార్యక్రమంలోని ముఖ్య భాగమని తెలిపారు. ఈ సమస్యలపై మండల రెవెన్యూ అధికారి శ్రవణ్ కుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు. అనంతరం రాష్ట్ర కౌన్సిలర్ గొబ్బెల కిష్టయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ఒక్కొక్క పాఠశాలని ఒక్కో విధంగా పరిగణలోకి తీసుకుంటూ ఉపాధ్యాయుల కేటాయింపులు అన్యాయంగా వ్యవహరిస్తూ పాఠశాల, పాఠశాలకి ఒక్కొక్క నియమాన్ని పెడుతూ ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ సమస్యల నుంచి ఉపాధ్యాయులకి మినహాయింపు కలిగించాలని ఉపాధ్యాయులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని తెలిపారు. ఈ



కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రఘునాథరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, కావలి ప్రధాన కార్యదర్శి బి.మధుసూదన్ రావు, కే.రఘునాథరావు, పెంచలయ్య, రమణకుమార్, సమాధి వెంకటేశ్వర్లు, కావలి పట్టణ అధ్యక్షులు లక్ష్మయ్య రాజయ్య ఏ.వెంకటేశ్వర్లు, ఏ. జగన్నాథ, ఈ. సురేష్, కావలి, బోగోలు, జలదంకి, అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కలికి యానాదిరెడ్డి వర్ధంతి వేడుకలు నిర్వహణ



**కావలి, మేజర్‌న్యూస్ :** మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి స్వర్గీయ కలికి యానాది రెడ్డి చనిపోయి 19 సంవత్సరంలో అవుతున్నప్పటికీ వారి మీద అభిమానం ప్రజల్లో ఇంకా తరగలేదని, అలాగే పదవిలో ఉన్న లేకపోయినా నిడారంభ్రమైన జీవితాన్ని జీవించిన వ్యక్తుల్లో చెప్పుకోదగ్గ వ్యక్తి అని వైయస్సార్సీపి నాయకులు తెలిపారు. అలాగే మొదటగా వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్ఆర్సిపి పట్టణ అధ్యక్షుని కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

## రైతు సంక్షేమమే టీడీపీ లక్ష్యం : ఎమ్మెల్యే



**రాపూరు, మేజర్‌న్యూస్ :** రైతు సంక్షేమమే తెదేపా పార్టీ లక్ష్యం అని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామక్రిష్ణ అన్నారు. సోమవారం కండలేరు హెడ్ రెగ్యులేటర్ నుండి స్విచ్ ఆన్ చేసి నీటిని తెలుగు గంగ కాలువకు విడుదల చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా కండలేరు నుండి వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు, శ్రీకాళహస్తి నియోజకవర్గలలోని 1లక్ష 60 వేల ఎకరాలకు సాగునిరు అందించే విదంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలు మేరకు నేడు తెలుగుగంగ నీటిని కూటమి నేతలతో కలిసి విడుదల చేశామన్నారు. దీని వలన తిరుపతికి కూడా త్రాగునిరు ఇవ్వటం జరుగుతుందన్నారు. అదేవిదంగా కండలేరు ఉన్న ఈ రాపూరు మండలంకు సాగునీరు అందిక పోవటం చాలా బాధాకరమన్నారు.ఈ మండలంకు కండలేరు నుండి సాగునీరు అందించేందుకు రాపూరు చెరువును రిజర్యయర్‌గా చేసేందుకు 574 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేస్తున్నామన్నారు. ఈ రిజర్వయర్ కెపాసిటీ 1.8 టీఎంసీ దీని క్రింద 30 వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చు అన్నారు. ఈ ప్రతిపాదనలులో పోకూరుపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కూడా వచ్చేలా రెడీ చేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ ఎస్ఎస్ఆర్ నాయుడు, తెలుగుగంగ అధికారులు, మండల పార్టీ నేతలు, కూటమి నేతలు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ ఎగ్జిట్ ఈసీ మెంబెర్‌కి సత్కారం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి బార్ అసోసియేషన్ ఎన్నికల్లో 2025-26 సంవత్సరంకు గాను జరిగిన బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్గా ఏకగ్రీవంగా యువ న్యాయవాది బెజవాడ అభిసాగర్‌ని వారి స్వగృహం నందు శాలివాహన సంఘం రాష్ట్ర నాయకులు బెజవాడ ఆదిశేషయ్య ఆధ్వర్యంలో యువ న్యాయవాదిని శాలువాతో సత్కరించి ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు ఆదిశేష్య మాట్లాడు తూ.. న్యాయవాది బెజవాడ అభిసాగర్ భవిష్యత్తులో ఇంకా ఎన్నో ఉన్నత పదవులు పొంది బడుగు బలహీన వర్గాలకు అండగా, నీతి, నిజాయి తీగా, యదార్ధంగా పేదలకు అండగా నిలిచి మంచి పేరు తీసుకురా వాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాలివాహన సంఘం నాయకులు తుమ్మల పల్లి మధుసూదన్ రావు, మోచర్ల మధు, బెజవాడ రవీంద్ర, మన్నేపల్లి రిషికేశ్, మన్నేపల్లి మురళీకృష్ణ, రఘురామయ్య, బీసీ న్యాయవాదులైన వెంకట రమణయ్య, గుంజి నరేష్ కుమార్‌లు ఉన్నారు.

## పక్షవాతంతో భాదపడుతున్నా సీనయ్యకు ఆర్దికసాయం

**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండలం చింతలపాలెం గ్రామానికి చెందిన గురునాథం సీనయ్య ఇటీవల పక్షవాతం భారినపడ్డాడు, రెక్కడితే కానీ డొక్కాడని సీనయ్య కుటుంబంను చూసి చలించి పోయిన ఉదయగిరి నియోజక వర్గం టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఉప్పుటూరి సుధీర్ బాబు



వెంటేన్ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి టీస్కెల్లి వారీ కుటుంబానికి ట్రస్ట్ ద్వార అర్దిక సహాయం చేయవలసిందిగా కోరిన వెంటనే వారి కుటుంబ పరిస్థితిని అడిగితెలుసుకున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మానవతా దృక్పదంతో వారికి పింఛను వచ్చేవిదంగా క్రుషి చేస్తానని మాటిస్తు, వెంటనే 10వేల రూపాయల అర్దిక సహాయం పంపించడం జరిగింది. ఈకార్యక్రమంలో ఉప్పుటూరి విజయకుమార్ ఉప్పుటూరి మల్లికార్జున, దేవరపల్లి మాల్యాద్రి, రావూరు విష్ణువర్ధన్, మన్నం రాఘవులు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కీటక జనితా వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి హుసేనమ్మ తెలిపారు. సోమవారం జిల్లా మలేరియా కార్యాలయంలో జరిగిన మాసాంతపు సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా పాజిటివ్ కేసులు వచ్చిన ప్రాంతాల్లో తీసుకొనవలసిన నివారణ చర్యలు గురించి అవగాహన కలగజేశారు. జిల్లాలోని శాశ్వత నీటి నిల్వలను గుర్తించి వాటిలో లార్వివోరస్ ఫిష్ లైన గంబుషియా చేపలను రిలీజ్ చేయుటకు ప్రణాళికలు రూపొందించాలని, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన వసతి గృహాలను తనిఖీ చేసి ప్రతి వసతి గృహమును మస్కిటో నెట్ ప్రూఫ్ చేయుటకు హాస్టల్ వార్డన్లకు సూచన చేయాలని తెలియజేశారు. వసతి గృహాలకు వేసవి సెలవులు ప్రకటించిన దృష్ట్యా దోమల ద్వారా వ్యాప్తి చెందు వ్యాధులను నివారించుటకు ముందస్తుగా ఐఆర్ఎస్ స్ప్రేయింగ్ చేయాలని తెలియజేశారు. జిల్లాలోని మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రభలే హై రిస్క్ ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాలలో ముందస్తు



చర్యల్లో భాగంగా స్ప్రేయింగ్ కార్యక్రమాలు చేయాలని తెలియజేశారు ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే జరుగు సమయంలో మానిటరింగ్ చేసి ఆరోగ్య కార్యకర్తలకు ఆశా కార్యకర్తలకు తగు సూచనలు సలహాలు అందజేయాలని తెలియజేశ్నా. ఈ కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి వి.నాగార్జునరావు జిల్లాలోని సబ్ యూనిట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# కార్మికుల పక్షాన ఎన్ఎంయూఏ మరింత నిలబడాలి



## వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఏపీఎస్ఆర్టీసీ ఎన్ఎంయు (ఏ) జోనల్ కమిటీ సమావేశాన్ని స్థానిక టౌన్ హాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్ఎంయు గౌరవ అధ్యక్షుడు ఏపీ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీఎస్ఆర్టీసీ అభివృద్ధిలో ఎన్ఎంయు చేస్తున్న పోరాటాలను ఆయన అభినందించారు. స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా ఆర్టీసీల పనిచేస్తున్న ఉద్యోగుల పక్షాన నిలబడాలని ఆయన సూచించారు. ఎన్ఎంయు ఏఅభివృద్ధికి తన వంతు కృషి ఎప్పుడు ఉంటుందని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ఎన్ఎంయు (ఏ) రాష్ట్ర అధ్యక్షులు రమణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఏ కార్మికుడికి అన్యాయం జరిగిన ఎన్ఎంయు అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్మికుల కోసమే తమ పోరాటమని అందుకనే కార్మికుల తమను నిరంతరం గెలిపిస్తూ తమను ప్రధాన యూనియన్‌గా నిలబెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో నాన్ ఆపరేషన్ జిల్లా కార్యదర్శి గాదిరాజు అశోక్ కుమార్, కర్తం ప్రతాప్ రెడ్డి, ఎన్ఎంయు రాష్ట్ర నేత రమణ రాజు, జోనల్ నేత లుక్సన్, జిల్లా నేతలు తదితరులు పాల్గొన్నారు.

# పార్కుల్లో పిల్లల కేరింతలు ఆనందంతో మనసుకు సంతృప్తి

- రాష్ట్రంలో పార్కులను అభివృద్ధి చేస్తాం
- తమ ప్రభుత్వ హయాంలో అన్ని పార్కులను ప్లే, జిమ్ ఎక్విప్మెంట్‌తో ఆధునీకరిస్తున్నాం
- నెల్లూరు నగరంలో ఆధునీకరించిన తిక్కన పార్కును ప్రారంభించిన మంత్రి నారాయణ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలో ఆధునికరించి ప్రారంభిస్తున్న ఒక్కొక్క పార్కులో పిల్లల కేరింతలు, ఆనందం చూస్తుంటే మనసుకు చాలా సంతృప్తిగా ఉందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. సోమవారం ఉదయం నెల్లూరు రంగనాయకులపేట లోని తిక్కన పార్కును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పార్కులో కలిసి తిరుగుతూ క్రీడాపరికాల వద్ద చిన్నారులతో ఆనందంగా గడిపారు. మంత్రికి ఘనస్వాగతం పలికిన ముస్లింలు రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్న మంత్రి సంకల్పం నెరవేరాలని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మంత్రిని సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఎంతో ప్రసిద్ధి చెందిన తిక్కన పార్కులో రూ.30 లక్షలతో ప్లే, జిమ్ ఎక్విప్మెంట్‌ను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. 2018లోనే నెల్లూరు నగరంలో 100 పార్కుల అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. గత ప్రభుత్వం పార్కుల అభివృద్ధిని అటకెక్కించిందన్నారు. మళ్లీ ఇప్పుడు తమ ప్రభుత్వ హయాంలో పార్కుల అభివృద్ధి పనులు మొదలుపెట్టినట్లు చెప్పారు. ప్రజారోగ్య పరిరక్షణతో పాటు పిల్లలకి ఆహ్లాదం కోసం పార్కులను ఆధునీకరిస్తున్నామన్నారు. ప్రారంభించిన పార్కుల్లో పిల్లల కేరింతలు, సంతోషాన్ని చూస్తే ఆనందంగా ఉందని మంత్రి నారాయణ చెప్పారు. అన్ని పార్కుల్లో కూడా భద్రత కోసం సిసి కెమెరాలను ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఖజానా ఖాళీగా వుందని, ప్రజలందరూ కాస్త ఓపికతో ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి నారాయణ కోరారు. ఇప్పుడిప్పుడే ఒక్కొక్క హామీని నెరవేరుస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో పార్కులను అభివృద్ధి చేస్తామని, రాష్ట్రంలోని ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన అన్ని హామీలను తప్పకుండా నెరవేర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఈ సందర్భంగా మంత్రి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ సీనియర్ నాయకులు వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# వీఎస్‌యూలో సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ విజయవంతంగా కొనసాగుతోంది



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏప్రిల్ 30వ తేదీ నుండి మే 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ మహిళల, పురుషుల సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ ఘనంగా కొనసాగుతోంది. ఈ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు నెల్లూరు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ నుండి అందిన సహకారం ప్రస్తావనీయమైంది. టోర్నీ నిర్వహణలో అవసరమైన అంపైర్లు, రెఫరీలను ఏర్పాటు చేయడంలో అసోసియేషన్ అధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి, కార్యదర్శి సిహెచ్ కామేశ్వరి, ఉపాధ్యక్షులు మల్లి రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి కీలక పాత్ర పోషించారు. వీరికి విశ్వవిద్యాలయం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. మహిళల టోర్నమెంట్ ఏప్రిల్ 30 నుండి మే 3వ తేదీ వరకు ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా ముగిసింది. పురుషుల టోర్నీలో ఇప్పటివరకు 61 మ్యాచ్‌లు సజావుగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్‌కు, టోర్నమెంట్‌కు సహకరించిన అంపైర్లకు విశ్వవిద్యాలయం మరోసారి కృతజ్ఞతలు తెలిపింది.

# సత్యనారాయణ లేఔట్‌లోని పబ్లిక్ ప్రాపర్టీని కాపాడాలని కలెక్టర్‌కు వినతి



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోనే సత్యనారాయణ లేఔట్‌లో రూ.3 కోట్ల విలువైన పబ్లిక్ ప్రాపర్టీ స్థలం 286 అంకణాలను అక్రమార్కుల పరం కాకుండా కాపాడాలని సోమవారం ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ ఆనంద్ ను కలిసి స్థానికులు వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ.. పొదలకూరు లో ఏం జరుగుతుందో తనకంతా తెలుసని మీరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తాను హైకోర్టుకు రిపోర్ట్ పంపానని అంతా మంచే జరుగుతుందని హామీనిచ్చారు. అంతేకాకుండా పొదలకూరు సత్యనారాయణ లేఔట్ విషయంలో పిటిషనర్లకు అనుకూలంగా వ్యవహరించి హైకోర్టుకు రెండు విధాలుగా నివేదికను అందజేసిన పంచాయతీ కార్యదర్శి ఒగ్గు శీనయ్య సస్పెన్షన్ కు ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రలోభాలకు లోనై పక్షపాతంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శి శీనయ్యపై సస్పెండ్ వేటు పడటంతో పొదలకూరు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే సత్యనారాయణ లేఔట్ లోని పబ్లిక్ ప్రాపర్టీని కాపాడడంలో జిల్లా కలెక్టర్ చూపిన ప్రత్యేక చొరవను స్థానిక ప్రజలు అభినందిస్తున్నారు.

## హరిహరమూర్తి అలంకారంలో శివయ్య



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరం మూలాపేట నందు స్వయంభుగా వెలసిన శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి దేవస్థానం నందు వసంతోత్సవములో భాగంగా సోమవారం స్వామి వారు హరిహరమూర్తి అవతారంలో దర్శనం ఇచ్చినారు. ఈ కార్యక్రమంకు ఉభయకర్తలుగా పలగంటి వెంకట సుబ్బారావు వ్యవహరించారు. ఈ వేడుకలు తిలకించడానికి భక్తులు భారీగా తరలి వచ్చినారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి ఆద్వర్యంలో ఘనంగా నిర్వించారు. దేవస్థానం వారు భక్తులకు తీర్థ ప్రసాదములు అందించినారు.

## మంత్రి లోకేష్‌ని కలిసిన కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో అమరావతిలో మర్యాదపూర్వకంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కలవడం జరిగింది. ఈ సందర్భంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 339 అభివృద్ధి కార్యక్రమాలను ఆయనకు వివరించారు. అలాగే ఈనెల 15 అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్నామని అందుకు సంబంధించిన బుక్ లెట్‌ను అందజేశారు.

## మహిమలూరు వాసికి గౌరవ డాక్టరేట్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మహిమలూరుకు చెందిన మహిమలూరు శ్రీనివాసులుకు అమెరికాలోని గ్లోబల్‌హ్యూమన్‌పీస్ యూనివర్శిటి ఆఫ్ డేలావర్ వారు గౌరవడాక్టరేట్ ప్రధానం చేశారు. మహిమలూరుకు చెందిన డిఆర్‌డివో మాజీ చైర్మెన్, ప్రముఖ శాస్త్రవేత్త, కేంద్రరక్షణ మంత్రిత్వ శాఖ మాజీ సాంకేతికసలహా దారులు, మన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డికి అనుచరుడైన శ్రీనివాసులు సతీష్‌రెడ్డి నిర్వహించే అన్ని సామాజికసేవా కార్యక్రమాల్లో ముమ్మరంగా పాల్గొంటూ సేవలందిస్తుంటారు. వివిద దేశాల నుండి సేవలందిస్తున్నవారితోపాటు శ్రీనివాసులును కూడా ఆ యూనివర్శిటి వారు గుర్తించి గౌరవడాక్టరేట్‌ను ప్రధానం చేశారు. తమిళనాడులోని కన్యాకుమారిలో శ్రీవివేకానంద కేంద్ర క్యాంపస్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీనివాసులుకు డాక్టరేట్ ప్రధానం చేశారు. అరుదైన గౌరవం దక్కించుకున్న శ్రీనివాసులును మహిమలూరు, ఆత్మకూరుకు చెందిన పలువురు నాయకులు, విద్యావేత్తలు, వివిద ప్రజాసంఘాల ప్రతినిధులు అభినందించారు.

# ఆత్మకూరు ప్రగతిని పట్టాలెక్కిస్తున్న మంత్రి ఆనం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు నియోజకవర్గం అభివృద్ధి విషయంలో గత 10సంవత్సరాలుగా పడకేసి ఉండగా నేటి ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయశాఖా మాత్యులు ఆనం రామనారాయణరెడ్డి వేగంగా ప్రగతిని పట్టాలెక్కిస్తున్నారు. గతంలో రామనారాయణరెడ్డి ఆత్మకూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా వ్యవహరించి ఉమ్మడి రాష్ట్ర ఆర్థికశాఖామాత్యులుగా వ్యవహరించారు. అప్పట్లో ఆత్మకూరు నియోజకవర్గానికి దాదాపు 2500కోట్ల రూపాయల నిధులు సాధించి అనేక రహదారులు, వంతెనలు, భవనాలు నిర్మించడంతోపాటు ప్రాంతీయ వైద్యశాలను, ప్రభుత్వ పాలిటెక్నిక్‌ను, రెవిన్యూ డివిజన్, మున్సిపాలిటీ, నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కస్తూర్బా పాఠశాలలు, ఆదర్శపాఠశాలలు, ఐటిఐలు సాధించారు. ఆత్మకూరులో అభివృద్ధికి చిహ్నం ఆనం అనే నానుడి జనాల్లో బలంగా నాటుకుపోయింది. 2024 ఎన్నికల్లో ఆయన టిడిపి తరపున అభ్యర్థికాగానే వైసిపి బలంగా ఉన్న ఈ నియోజకవర్గంలో అభివృద్ధి ప్రదాత వచ్చారు. ఆయన ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తే ప్రగతి పరుగులు తీస్తుందని అందరూ విశ్వశించి అనూహ్యంగా అన్నివర్గాలు ఆయనకు బాసటగా నిలిచి విజయం కట్టబెట్టారు. ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక సీనియర్‌గా, గతంలో అనేక మంత్రిత్వశాఖలు నిర్వహించిన నేతగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుర్తించి ఆయనకు దేవాదాయమంత్రిగా ఎంపికచేశారు. ఆయన పదవి చేపట్టి ఏడాది కూడా కాకున్నా తన రాజకీయ, పాలనానుభవంతో ముఖ్యమంత్రి సాన్నిహిత్యంతో, సహచరమంత్రుల సహకారంతో ఆత్మకూరు అభివృద్ధికి కంకణదారుడయ్యారు. టిడ్కో గృహాల్లో రామాలయాన్ని సాధించారు. పంచాయతీరాజ్ అతిథిగృహానికి 1.7కోట్ల రూఊపాయల నిధులు సాధించి శంఖుస్థాపన గావించారు. ఆర్‌అండ్‌బి అతిథిగృహం నిర్మణం నలిచిపోయి ఉండగా నిధులు సాధించి పూర్తిచేయించి ప్రారంభింపజేశారు. ఆత్మకూరు మున్సిపాలిటీలో తాగునీరు, రోడ్డు, డ్రైనేజిలకు దాదాపు 65కోట్ల రూపాయలు సాధించారు. నిలిచిపోయి ఉన్న సోమశిల హైలెల్‌కెనాల్ నిర్మాణాలు, సోమశిల ప్రాజెకుట్ట ఆప్రాన్‌పనులు ప్రారంభింపజేశారు. నియోజకవర్గంలో సిమెంటురోడ్ల నిర్మాణానికి కోట్లాది రూపాయలను ఉపాధిహామీ పథకం ద్వారా మంత్రి ఆనం సాధించగా ఇప్పటికే అనేక రోడ్ల నిర్మాణాలు పూర్తికాగా పలురోడ్లు నిర్మాణంలో ఉన్నాయి. చెరువులు, కాలువల అభివృద్ధికి దాదాపు 100కోట్ల రూపాయలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఆత్మకూరులో ఆయన మంజూరు చేయించిన 100 పడకల హాస్పిటల్ ఆయన ప్రతిపాదన, కృషితో జిల్లా వైద్యశాలగా అప్‌గ్రేడ్ కాగా అన్నీ వసతులు సమకూర్చలేదని ముఖ్యమంత్రి, వైద్యవాఖా మంత్రి దృష్టికి తీసుకెళ్ళి 300పడకల హాస్పటల్‌గా అభివృద్ధి చేసేందుకు తీవ్రంగా కృషిచేస్తున్నారు. ప్రభుత్వ ఏర్పడిన ఈ అతికొద్ది సమయంలోనే ముఖ్యమంత్రిని 2దపాలు ఆత్మకూరు నియోజకవర్గానికి రప్పించి పలు అభివృద్ధి పనులకు శ్రీకారంచుట్టడంతోపాటు పలు హామీలు పొందారు. ఐదారు మంది మంత్రులను ఆత్మకూరుకు రప్పించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఆత్మకూరుకు రప్పించి నారంపేటవద్ద పారిశ్రామికపార్కును ప్రారంభింపజేయడంతో అనేక పరిశ్రమాలు ఇక్కడ ఏర్పాటుకు అవకాశం ఏర్పడడంతోపాటు ముఖ్యమంత్రి హామీ కూడా లభించింది. దాంతో పరిశ్రమలు రాగవలన్న విశ్వాసం, వేలాదిమంది నిరుద్యోగయువతకు ఉద్యోగావకాశాలు లబించగలవన్న నమ్మకం జనాల్లో బలంగా ఏర్పడింది. నడికుడి-శ్రీకాళహస్తి రైలుమార్గం నత్తనడకన ఉండగా మంత్రి ఆనం దృష్టిసారించారు. త్వరితగతిన పూర్తిచేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేయగా ముఖ్యమంత్రి కూడా ఇటీవల ఆత్మకూరులో హామీ ఇచ్చారు. ఆత్మకూరు పట్టణ బైపాస్‌రోడ్డు విస్తరణకు, చెరువువద్ద సుందరీకరణకు, పట్టణం శివార్లలో బైపాస్‌రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయించి ప్రభుత్వం నుండి నిధులు సాధించే యత్నంలో మంత్రి రామనారాయణరెడ్డి ఉన్నారు. గత 10సంవత్సరాలుగా ఆత్మకూరులో ఎలాంటి అబివృద్ధి లేకుండా ఉన్న విషయం తెల్సిందే. కాగా గతంలో నారంపేట వద్ద ఒక పరిశ్రమ ఏర్పాటు అంటూ శిలాఫలకం వైసిపి ప్రభుత్వం వేసినా ఆ పరిశ్రమను అప్పటి ముఖ్యమంత్రి తమ స్వంత జిల్లా కడపజిల్లాకు తరలించుకోవడం తెల్పిందేకాగా నారంపేట పార్కును అభివృద్ధి చేయించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుచేతులమీదుగా ప్రారంభించి పలు పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని సాక్షాత్తు ముఖ్యమంత్రితోనే హామీ ఇప్పించారు. అభివృద్ధిప్రధాతగా పేరుగాంచిన ఆనం రామనారాయణరెడ్డి ఈ10నెలల కాలంలోనే చేస్తున్న కృషి, పట్టుదల, సంకల్పం, లక్ష్యం చూస్తుంటే ఆత్మకూరు అభివృద్ధిని గతంలో పరుగులు తీయించిన మంత్రి నేడు ప్రగతిని పట్టాలెక్కిస్తున్నారని, ఇక స్పీడందుకుంటుందని, అనూహ్యంగా ఆత్మకూరు



అభివృద్ధి సాధ్యమవుతుందని సర్వత్రా భావిస్తున్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీ, నియోజకవర్గంలోని ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట, సంగం, చేజర్ల, మర్రిపాడు మండలాలు జనాలు ఆశించినదానికన్నా మరింతగా అభివృద్ధి సాధ్యమని అందరూ ఎంతో విశ్వాసంగా ఉన్నారు. ఆయన పార్టీపరంగా సభ్యత్వనమోదు, ఇతర పార్టీ కార్యకలాపాల్లో ప్రత్యేకంగా శ్రద్ధచూపుతూ రాష్ట్రంలోనే ద్వితియ స్థానంలో ఉంటున్నారు. ఆయనకు దేవాదాయశాఖను ముఖ్యమంత్రి అప్పగించగా నిరంతరం పర్యటిస్తూ రాష్ట్ర అధికారులతో సమీక్షిస్తూ పలు సంస్కరణలు, నిర్ణయాలు తదితరాలతో ఆయన బాధ్యతలను 100శాతం నిర్వహించారన్న పరిస్థితి అటు ప్రభుత్వ అధినేత వద్ద రికార్డు అయిందని కూడా తెలుస్తోంది. ఏదేమైనా ఆత్మకూరు అభివృద్ధి అంటే ఆనంతో సాధ్యం అన్న నానుడి నిజం కాగలదని సర్వత్రా భావిస్తున్నారు.

## వైసీపీ యువ నాయకున్ని పరామర్శించిన ఆనం

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** ఇటీవల యాక్సిడెంట్ గుర్రై గాయపడిన మాజీ సిపిఎం నాయకులు దావులూరి గురునాథంని, వైసిపి యువ నాయకుడు దావులూరి లోకేష్‌ని 23వ డివిజన్ పడారుపల్లి సుందరయ్య కాలనీలోని వారి నివాసం నందు వారి ఆరోగ్యం గురించి నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి విచారించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాస్ రావు,నెల్లూరు రూరల్ నియోజకవర్గ, ఎంప్లాయస్, పెన్షనర్స్ విభాగ అధ్యక్షుడు కనకట్ల మోహన్ రావు ముదిరాజ్, 23వ డివిజన్ ఇన్‌చార్జ్ యనమల మల్లికార్జున్ రెడ్డి, 23వ డివిజన్ నాయకులు తల్పరెడ్డి సుధీర్ రెడ్డి, గంగవరపు మల్లికార్జున రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## గ్రీవెన్స్ డే సందర్భంగా తహసిల్దార్‌కు వినతులు



**బోగోలు, మేజర్‌న్యూస్ :** గ్రీవెన్స్ డే సందర్భంగా బోగోలు మండలం తాసిల్దార్ కార్యాలయంలో సోమవారం బోగోలు మండలంలో సమస్యలను పరిష్కరించేందుకు త్వరితగతిన పూర్తయ్యలా చర్యలు తీసుకుంటామని మండల తహసిల్దార్ సురేష్ బాబు పేర్కొన్నారు. బోగోలు మండలంలోని రైతు సమస్యలపై మండల టిడిపి అధ్యక్షులు మాలే పాటి నాగేశ్వరరావు రైతులతో కలిసి తాసిల్దార్ కార్యాలయంలోని తాసిల్దార్ సురేష్ బాబుకు కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండల టిడిపి నాయకులు మాలేపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. బోగోలు మండలంలోని రైతు సమస్యలను పరిష్కారానికి తహసిల్దార్‌ను కలిసామని మండలంలోని రైతుల సమస్యను త్వరితగతిన పూర్తి చేస్తామని, తాసిల్దార్ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, బోగోలు మండలంలోని రైతులు టిడిపి నాయకులు ఉన్నారు.

### దర్గా, శ్మశానవాటికలో..

## మౌళికవసతులు కల్పించాలి : ఆవాజ్

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని శ్రీ సుల్తాన్‌షాహిద్ దర్గా, శ్మశానవాటికలో కనీస మౌళికవసతులు కల్పించాలని ఆవాజ్‌కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. మౌళికవసతులు, ఇతరత్రా సమస్యల పరిష్కరించాలంటూ ఇటీవల ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో దర్గావద్ద ధర్నా నిర్వహించిన విషయం విధితమేకాగా ఇంకా ఎవరూ స్పందించలేదని వారు పేర్కొన్నారు. గత సంవత్సరం జూలైలో మూడురోజుల పాటు జెసిబితో పెకలించిన కంపచెట్లను ఇప్పటికీ తొలగించలేదన్నారు. వెంటనే ఆ చెట్లను తొలగించాలని, శ్మశానవాటికలో అంతర్గత రోడ్లు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లను తొలగించి నూతనంగా నిర్మించాలని, దర్గాపరిసరాలను శుభ్రపరచాలని, గత 12 సంవత్సరాలుగా వక్ఫబోర్డు రూములుద్వారా వస్తున్న ఆదాయ వివరాలు తెలపాలని, దర్గాలో ముజావర్, స్వీపర్ల జీతాలు పెంచాలని, స్వీపర్లకు 8గంటలపనివిధానం అమలుచేయాలని ఆవాజ్‌కమిటీ మండల కార్యదర్శి పి.యస్దాని డిమాండ్ చేశారు. వెంటనే చర్యలు లేకుంటే ముస్లింలను చైతన్యపరిచి సుల్తాన్‌షాహిద్ దర్గా, శ్మశానవాటిక కమిటీని ఏర్పాటు చేసుకొని వక్ఫబోర్డుకు చెల్లించాల్సిన నగదను నిలిపివేస్తామని, ఆనగదుతోనే కమిటీ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించుకుంటామని యస్ధాని పేర్కొన్నారు.